అనువాదం

# మార్క్సిస్ట్ విమర్శ – కొన్ని ప్రతిపాదనలు

లూనషార్స్కీ లెనిన్ సమకాలీనుడయిన సోవియట్ రచయిత, విమర్శకుడు. అతను 1928లో రాసిన Theses on the problems of Marxist criticism అనే వ్యాసానికి ఇది సంక్షిప్త అనువాదం.

**1. ఇది** మన సాహిత్య వికాసానికి చాలా ముఖ్యమయిన, నిర్ణాయకమయిన సమయం. మన సమాజంలో ఒక కొత్త జీవితం నిర్మితమవుతూ ఉంది. ఈ కొత్త జీవితాన్ని మన సాహిత్యం, ఎంత అస్పష్టమయిన అస్థిరమయిన రూపంలోనయినా సరే, ప్రతిబింబించడం నేర్చుకుంటోంది. అంతేకాకుండా ఈ నిర్మాణక్రమం మీద తనకుండే రాజకీయ, నైతిక ప్రభావం తాలూకు సమస్యను గూడ సాహిత్యం ముమ్ముందు ఎదుర్కుంటుంది.

మన దేశంలో మిగిలిన దేశాలలోకన్నా వర్గవిభేదాలు తక్కువగా ఉన్నా, ఇప్పుడప్పుడే దీన్ని వర్గరహిత సమాజంగా వర్ణించలేం. పాతకొత్తల మధ్య కలహం సాగుతూనే ఉంది. యూరప్ సమాజపు ప్రభావం, గతం తాలూకు, గతంలోని పాలకవర్గాల అవశేషం తాలూకు ప్రభావం, కొత్త ఆర్థిక ప్రణాళిక పుణ్యమా అని కొంతమేరకు వ్యాపించి కూర్చున్న కొత్త పెట్టుబడిదారీవర్గ ప్రభావం – యివన్నీ కనిపిస్తున్నాయి. ఇవి కొంతమంది వ్యక్తుల, బృందాల ఆలోచనలలోనే కాదు, రకరకాల సంకర రూపాలలో గూడా కనిపిస్తాయి. ఉద్దేశ్యపూర్వకంగాను ప్రత్యక్షంగాను విద్వేషపూరితమయిన బూర్జువా అంశమే కాకుండ, అంతకంటె బహుశ ప్రమాదకరయినది, ఖచ్చితంగా అంతకంటె జయించడానికి కష్టతర మయినది. మరొక అంశం ఉన్నదన్న సంగతి గుర్తుంచుకోవాలి. ఇది దైనందిన జీవితంపట్ల పెటీబూర్జువా వర్గ దృక్పథం. ఇది కార్మికవర్గం యొక్క వైఖరిలోనే కాకుండ చాలామంది కమ్యూనిస్టుల వైఖరిలోనికి గూడ ప్రవేశించింది.

---

సృజన, సెప్టెంబర్ 1981

2. ఇటువంటి పరిస్థితులలో సాహిత్యానికుండే గణనీయమయిన పాత్రతోబాటు మార్క్సిస్టు విమర్శకు గూడ చెప్పుకోదగ్గ బాధ్యత ఉంటుంది. మార్క్సిస్ట్ విమర్శ సాహిత్యంతోబాటు ఈ రోజు కొత్త మానవుడిని, కొత్త జీవితాన్ని నిర్మించే క్రమంలో ఉత్సాహంతోను, శక్తివంతంగాను భాగం పంచుకోవాల్సిన అవసరం ఉంది.

3. మార్క్సిస్ట్ విమర్శకు తక్కిన సాహిత్య విమర్శనా పద్ధతులకు ముఖ్యమయిన తేడా యేమిటంటే, మార్క్సిస్ట్ విమర్శకు సామాజిక శాస్త్రీయ (sociological) స్వభావం వుంటుంది. ఇక్కడ 'సామాజికశాస్త్రం' అన్నమాట మార్క్స్ – లెనిన్‌లు చెప్పిన శాస్త్రీయమయిన అర్థంలో వాడబడుతోంది.

కొంతమంది సాహిత్య విమర్శకుడికి, సారస్వత చారిత్రకునికి తేడా చూస్తారు. ఈ తేడా వర్తమానానికి, గతానికి చెందినవన్న వ్యత్యాసం వల్ల వచ్చింది కాదు. సారస్వత చారిత్రకునికి రచన యొక్క మూలం ఏమిటి, సమాజంలో దాని స్థానం ఏమిటి, సామాజిక జీవితం మీద దాని ప్రభావం ఏమిటి అనే విషయాల శాస్త్రీయ పరిశీలన ముఖ్యంకాగా, సాహిత్య విమర్శ రచన యొక్క శిల్పపరమయిన, సమాజపరమయిన సద్గుణాలను, దోషాలను అంచనా వేయడాన్ని ప్రాతిపదికగా కలిగి వుంటుంది.

అయితే మార్క్సిస్ట్ విమర్శకునికి ఈ విభేదం చాలావరకు అర్థరహిత మయినది. మార్క్సిస్ట్ విమర్శలో శుద్ధ విమర్శ (criticism in the strict sense of the word) అనివార్యంగా ఒక భాగమయినా, అంతకంటె మౌలికమయినది సామాజిక విశ్లేషణ.

4. మరయితే మార్క్సిస్ట్ విమర్శకుడు ఈ సామాజిక విశ్లేషణ ఏ విధంగా చేస్తాడు? మార్క్సిజం సామాజిక జీవితాన్ని ఒక అవయవి (organism) గాను అందులోని వివిధ భాగాలను ఒకదాని మీద ఒకటి ఆధారపడే అవయవాలగాను పరిగణిస్తుంది. ఇందులో నిర్ణాయకమయిన పాత్ర వహించేది భౌతిక ఆర్థిక సంబంధాలు, అందునా శ్రమరూపాలు. ఒక సామాజిక యుగాన్ని (epoch) స్థూలంగా విశ్లేషించేటప్పుడు మార్క్సిస్ట్ విమర్శకుడు ఆ యుగం తాలూకు సామాజిక వికాసాన్ని పరిపూర్ణంగా చిత్రించాలి. అయితే కేవలం ఒక రచయితనో రచననో

చర్చించేటప్పుడు మౌలికమయిన ఆర్థిక పరిస్థితులను విశ్లేషించడం అత్యవసరం గాదు. ఇక్కడ ప్లెఖనోవ్ చేసిన ఒక సూత్రీకరణ వర్తిస్తుంది. అదేమిటంటే, కళాసృష్టి బహుకొద్ది మేరకు మాత్రమే ఉత్పత్తి రూపాలమీద ప్రత్యక్షంగా ఆధారపడి వుంటుంది. ఆ సంబంధం సామాజిక వర్గ నిర్మాణం ద్వారానూ, వర్గాల అవసరాల ననుసరించి ఏర్పడే వర్గమనస్తత్వం ద్వారానూ ప్రచ్ఛన్నంగా ఏర్పడుతుంది. సాహిత్యం ఎప్పుడూ కూడ – రచయితకు తెలిసో తెలియకో – అతను ప్రాతినిధ్యం వహించే వర్గం మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. లేదా, అతనిమీద ప్రభావం ఉన్న వివిధ వర్గాలకు చెందిన అంశాలను ప్రతిబింబిస్తుంది. దీన్ని చాలా జాగ్రత్తగా విశ్లేషించాలి.

5. కళకు వర్గ మనస్తత్వానికి లేక సామాజిక బృందాల మనస్తత్వానికి గల సంబంధం ముఖ్యంగా దాని వస్తువు (content) చేత నిర్ణయించబడుతుంది. ఆలోచనకు అతి సన్నిహితమయిన కళ సాహిత్యం. దానిలో రూపం కంటె వస్తువుకుగల ప్రాముఖ్యత మిగిలిన కళారూపాలలో కంటె అధికంగా వుంటుంది. అందునా, వస్తువులోని అన్ని అంశాల కంటె కళాపరమైన అంశం – అంటే బింబాల రూపంలోను ప్రతీకల రూపంలోను ఉన్న ఆలోచనల అనుభూతుల ప్రవాహం – సాహిత్యంలో నిర్ణాయక పాత్ర వహిస్తుందన్న విషయం స్పష్టమే. ఈ వస్తువే ఒక నిర్దిష్టరూపాన్ని (form) వెతుక్కుంటుంది. వస్తువుకు సరిగ్గా సరిపడే రూపం ఒక్కటే ఉంటుందని చెప్పవచ్చు. రచయిత తాను వెలువరించదలచుకున్న ఆలోచనలను, చెప్పదలచుకున్న విషయాలను స్పష్టంగా వ్యక్తీకరించి పాఠకుడిని బలంగా ప్రభావితంచేసే రూపాన్ని ఎంతో కొంతమేరకు సాధించుకుంటాడు.

కాబట్టి మార్క్సిస్ట్ విమర్శకు ప్రధానమయిన విషయం రచనయొక్క **వస్తువు. **అందులోని **సామాజిక సారాంశం.** మార్క్సిస్ట్ విమర్శకుడు ఈ వస్తువుకు, వివిధ సామాజిక బృందాలకుగల సంబంధాన్ని, సామాజిక జీవితంమీద దానికుండే ప్రభావాన్ని చూస్తాడు. ఆ తరువాతే రచనయొక్క రూపాన్ని పరిగణిస్తాడు. ఇది గూడ, ఆ రూపం తన కర్తవ్యం ఏ విధంగా నిర్వహిస్తోందో – అంటే రచనను వీలయినంత ప్రభావయుతంగాను, ఆకట్టుకునేటట్టు చేస్తున్నదా లేదా అని వివరించే దృష్టితో చూస్తాడు.

6. అంతమాత్రాన సాహిత్య **రూపాల** విశ్లేషణ తాలూకు ప్రత్యేకమయిన కర్తవ్యాన్ని మార్క్సిస్ట్ విమర్శకుడు విస్మరించడానికి వీలులేదు. రచనయొక్క రూపం కేవలం వస్తువు చేతనేగాక ఇతర విషయాలచేత గూడ నిర్ణయించబడుతుంది. రచనను ప్రభావితం చేసిన వర్గాల ఆలోచనా విధానం, జీవనవిధానం, సమాజం యొక్క భౌతిక సంస్కృతి స్థాయి, పరిసర సమాజాల ప్రభావం, గతం తాలూకు జడత్వం, యివన్నీ మొత్తం జీవితం మీద ప్రభావం కలిగివున్నట్లే రచన యొక్క రూపం మీద గూడ కలిగివుంటాయి, దాన్ని నిర్ణయించడంలో అనుబంధ (subsidiary) పాత్రను కలిగివుంటాయి. ఒక్కొక్కసారి రూపం కేవలం ఒక రచనకు సంబంధించింది కాక ఆ మొత్తం చారిత్రక యుగానికి, సాంప్రదాయానికి సంబంధించి వుంటుంది. అంతేకాక, రూపం వస్తువును విరోధించే శక్తిగూడ కావచ్చు, వస్తువు నుండి వేరుపడి అస్పష్టంగా తయారుకావచ్చు. ఇదెప్పుడు జరుగుతుందంటే ఆ సాహిత్యం ప్రాతినిధ్యం వహించే వర్గాలు పుష్టి లేనటువంటివి, జీవితాన్ని చూసి భయపడి మాటలగారడీ వెనుక, లేకపోతే వెకిలితనం వెనుక దాక్కునేవయినప్పుడు. ఇవన్నీ గూడ మార్క్సిస్ట్ విశ్లేషణలో భాగం కావాలి.

7. మనం ఇంతవరకు మార్క్సిస్ట్ విమర్శను కేవలం సారస్వత వైదుష్యం యొక్క వ్యాపారంగా చూశాము. ఇక్కడ మార్క్సిస్ట్ విమర్శకుడు సామాజిక శాస్త్రజ్ఞుడిగా, మార్క్సిస్ట్ విశ్లేషణా పద్ధతిని సాహిత్యానికి అన్వయించేవాడిగా కనిపిస్తాడు. మార్క్సిస్ట్ విమర్శకు పునాదివేసిన ప్లెఖనోవ్ మార్క్సిస్ట్ పాత్ర యిదేనని నొక్కి చెప్పాడు. ప్లెఖనోవ్ మార్క్సిస్టులకు, ప్రబోధకులకు (enlighteners) ఇక్కడ తేడా చెప్పాడు. ప్రబోధకుడు సాహిత్యానికి ఆశయాల్ని నిర్దేశిస్తాడని, సాహిత్యాన్ని ఆజ్ఞాపిస్తాడని, ఆ ఆశయాల దృష్ట్యా సాహిత్యాన్ని అంచనా వేస్తాడని, దానికి విరుద్ధంగా మార్క్సిస్టు ఒక రచన రావడానికి ప్రకృతి సిద్ధమయిన కారణాలేమిటో చూస్తాడని ప్లెఖనోవ్ చెప్పాడు. ఈ రకంగా విషయగతము, శాస్త్రీయము అయిన మార్క్సిస్ట్ విమర్శనా పద్ధతికి సౌందర్యవాదుల, చపలచిత్తుల రీతి రహితమయిన ఆత్మాశ్రయ విమర్శనా పద్ధతికి సరిగ్గానే తేడా చెప్పడమే కాకుండ, తరువాతి మార్క్సిస్ట్ విమర్శకులకు మార్గదర్శకుడయ్యాడు.

అయితే ప్రపంచాన్ని గుర్తించడం, విశ్లేషించడం మాత్రమే కార్మికవర్గం గుణమని అనుకోకూడదు. మార్క్సిజం ఒక సామాజిక సిద్ధాంతం మాత్రమే కాదు,

చైతన్యవంతమయిన నిర్మాణ ప్రణాళిక. విషయాల్ని విషయగతంగా అంచనా వేయకుండ అటువంటి నిర్మాణం సాధ్యం కాదు. మార్క్సిస్టయిన వాడు తనచుట్టూ ఉన్న విషయాల మధ్య సంబంధాలను గ్రహించ లేకపోతే ఒక మార్క్సిస్టుగా అతనికి స్థానం లేదు. కాని నిజమయిన మార్క్సిస్టు అక్కడితో ఆగిపోవడానికి వీలులేదు. అతను పరిసరాలను ప్రభావితం చేయాలి. మార్క్సిస్టు విమర్శకుడు సాహిత్య గ్రహాల గతిసూత్రాలను వివరించే సారస్వత ఖగోళ శాస్త్రజ్ఞుడు కాడు. అతని కర్తవ్యం దీన్ని అధిగమించి వుంటుంది. అతనొక యోధుడు, నిర్మాణ కార్యకర్త. ఈ అర్థంలో సాహిత్యాన్ని అంచనా వేయడం (the evaluation factor) వర్తమాన మార్క్సిస్టు విమర్శలో అతి ముఖ్యమయిన అంశంగా గుర్తించాలి.

8. మరయితే ఈ రకంగా సాహిత్యాన్ని అంచనా వేయడానికి ప్రాతిపదిక ఏది? దీనికి సమాధానం చెప్పాలంటే మొదట సాహిత్యం యొక్క వస్తువును తీసుకుందాం. ఈ విషయంలో, స్థూలంగా చెప్పాలంటే, ఎటువంటి సంశయానికి స్థానంలేదు. శైశవ దశలోని కార్మికవర్గ నీతికి ఏది ప్రాతిపదికో, సాహిత్య విమర్శకూ అదే. కార్మికవర్గ వికాసానికి విజయానికి దోహదం చేసేది మంచి, దానికి హాని కలిగించేది చెడు.

మార్క్సిస్టు విమర్శకుడు రచనలోని సామాజికమయిన పోకడ (trend) ఏమిటో చూడాలి. రచన ఏ దిక్కుగా సాగుతుందో గుర్తించాలి – అది ఎంత అనిశ్చితంగా వున్నా, తాను రచన గురించి చేసే అంచనాకు దీన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి.

అయితే ఒక రచనయొక్క వస్తువును సామాజికంగా అంచనా వేయడం సులభసాధ్యం కాదు. మార్క్సిస్టు విమర్శకుడు చాలా నైపుణ్యంతోను సున్నితత్వంతోను వ్యవహరించాలి. ఇక్కడ నైపుణ్యం అంటే మార్క్సిజానికి సంబంధించిన నైపుణ్యం కాదు, విమర్శకు సంబంధించింది. అది లేకుండ విమర్శ సాధ్యం కాదు. నిజంగా ఉన్నతమయిన రచనలో పరిగణించవలసినవి చాలా అంశాలుంటాయి. త్రాసులో తూకం వేసినట్లు అంచనా కట్టడం సాధ్యం కాదు. మార్క్సిస్టు విమర్శకుడు కేవలం సమకాలీన సమస్యలను చర్చించే సాహిత్యాన్నే నిజమయిన సాహిత్యంగా చూడ కూడదు. సమకాలీన సమస్యలకున్న ప్రత్యేకమయిన ప్రాముఖ్యతను కాదనగూడదు కాని, తాత్కాలికంగా అంత ప్రాముఖ్యత లేనట్లు కనబడ్డా, మరీ స్థూలంగాను

వాస్తవానికి దూరంగాను ఉన్నట్లు కనబడ్డా జాగ్రత్తగా పరిశీలిస్తే సామాజిక జీవితం మీద ప్రభావం కలిగివుండే సమస్యలను నిరసనతో చూడడం తప్పు.

అయితే ఒక కార్మికవర్గ రచయితగాని కవిగాని ఈ రకమయిన సాధారణ (general) సమస్యల పరిష్కారానికి ప్రయత్నించినప్పుడే, అంటే సంస్కృతికి సంబంధించిన మౌలికమయిన విషయాలను కార్మికవర్గ దృక్పథం నుండి పునఃపరిశీలించినప్పుడే, విమర్శకుడు తికమక పడే ప్రమాదం వుంది. ఎందుకంటే ఇక్కడ విమర్శకు మనకు సరయిన ప్రాతిపదిక లేదు. అంతే కాకుండ ఇటువంటి సమస్యలకు సంబంధించి మనం ఆశించేది రచయిత పరిష్కారం యివ్వాలని కాదు, సమస్యను విశ్లేషించి కొన్ని ప్రతిపాదనలు చేయాలని మాత్రమే. అటువంటి ప్రతిపాదనలలో దుందుడుకుతనానికి సయితం విలువ ఉంటుంది. అయితే కొంతమేరకు యిదంతా సమకాలీన విషయాలకు సంబంధించిన రచనలకు గూడ వర్తిస్తుంది. మన ప్రణాళికలో ఒక స్థాయికి ఎదిగిన విషయాల్నే తన రచనలో వివరించే రచయిత మంచి రచయిత కాడు. విలువగల రచనలు చేయాలంటే రచయిత కొత్త విషయాల్ని ప్రస్తావించాలి. ఇదివరకు అనుభవంలో లేని విషయాల్ని గురించి, తార్కిక పరిశీలనకు లొంగని విషయాల్ని గురించి చెప్పాలి.

రచనలోని సామాజిక అంశాన్ని అంచనా వేయడంలో అతిముఖ్యమయిన విషయం ఏమిటంటే, మనకు మొదట విజాతీయంగాను శత్రుత్వంతో కూడినట్లుగాను కనిపించే రచనను పునఃపరిశీలన చేయడం, మన శత్రువుల వైఖరి తెలుసుకోవడం, మనవే కాకుండా ఇతర దృక్పథాల నుండి సమాజాన్ని గురించి చేసే వివరణను ఉపయోగించుకోవడం, ఇవి చాలా ముఖ్యం. ఇవి చాలా సందర్భాలలో సరయిన తీర్మానాలకు దారితీస్తుంది; కనీసపక్షం జీవితాన్ని గురించిన మన జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. ఒక రచయిత కేవలం పెటీ బూర్జువా రచయిత అనో మరొకటనో మార్క్సిస్టు విమర్శకుడు తోసిపుచ్చడానికి లేదు. అటువంటి రచనల నుండి గూడ చాలా ప్రయోజనాన్ని పొందవచ్చు. ఈ కారణంచేత రచన యొక్క సామాజిక పోకడ దృష్ట్యా మాత్రమే కాకుండా మన నిర్మాణ కార్యక్రమానికి దానికుండగల ఉపయోగం దృష్ట్యా రచనను పునఃపరిశీలించడం మార్క్సిస్టు విమర్శకుని కర్తవ్యం.

పై మాటలకొక సవరణ చేయాలి. విజాతీయంగాను శత్రుత్వంతో కూడినవి గాను కనిపించే రచనలు, పైన చెప్పిన అర్థంలో కొంత ఉపయోగకరంగా వున్నా, చాలా అపాయకరంగాను విషపూరితంగాను విప్లవ ప్రతీఘాతుక ప్రచారానికి రూపాంతరంగాను కూడా ఉండవచ్చు. అయితే అప్పుడు మార్క్సిస్టు చేయవలసినది విమర్శించడం కాదని, నిరోధించడమని (censorship) వేరే చెప్పనవసరం లేదు.

9. రచన యొక్క వస్తువును అంచనా వేయడంకన్నా రూపాన్ని అంచనా వేయడం మార్క్సిస్టు విమర్శకునికి కష్టతరమయిన పని.

అయితే యిది చాలా ముఖ్యమయిన పని: దీని ప్రాధాన్యత ప్లెఖనోవ్ నొక్కి చెప్పాడు. మరయితే రూపాన్ని ఏ ప్రాతిపదిక మీద అంచనా వేయాలి? రూపం వస్తువుకు సరిగ్గా సరిపోవాలి, వస్తువును సరిగ్గా వ్యక్తీకరించాలి, వస్తువు పాఠకునిమీద బలమయిన ప్రభావం కలిగించేలా చేయాలి.

అన్నిటికంటె ప్రధానమయిన సూత్రం - ఇది ప్లెఖనోవ్ చెప్పింది - ఏమిటంటే సాహిత్యం బింబాల (Images) కళ, అందులోకి అనాచ్ఛాదితమయిన భావాల ప్రచారం ప్రవేశిస్తే అది రచనమీదే దెబ్బతీస్తుంది. అయితే ప్లెఖనోవ్ చేసిన ఈ సూత్రీకరణకు సార్వత్రిక ప్రతిపత్తి లేదన్నది స్పష్టమే. ఉదాహరణకి ఈ సూత్రాన్ని ఉల్లంఘించే బహు చక్కని రచనలు సాల్టికోవ్ ష్చెద్రిన్, ఉస్పెన్‌స్కీ, ఫర్మానోవ్‌లు చేశారు. అంటే నవలను, ప్రచారాన్ని కలిపే సంకరజాతి సాహిత్యానికీ స్థానం వుంది. అయితే సాధారణ పరిస్థితులలో ఇవి చేయకుండడం మంచిది. 'సాహిత్యం' అన్న మాటను సంకుచితంగా అర్థం చేసుకోకపోతే మంచి ప్రచార సాహిత్యాన్ని గూడ సాహిత్యమనే అనాలి. కాని కేవలం ప్రచారక విషయాలతో నిండిన నవల, ఆ ప్రచారం ఎంత తెలివిగావున్నా, పాఠకుడిని కదిలించలేదు. కాబట్టి సాహిత్య వస్తువు రచనలో కరిగించిన లోహంలాంటి బింబాల ప్రవాహంగా కాక కలప దుంగలలాగా తేలినప్పుడు, రచయిత తన రచనా వస్తువును జీర్ణించుకోలేదని విమర్శకుడు అనవలసి వుంటుంది.

'రూపం వస్తువుకు సరిపోవాలి' అనే ప్రాథమికమయిన సూత్రీకరణ నుండే రెండవ సూత్రాన్ని గూడ మనం పరిగ్రహించవచ్చు. ఇది కళారూపం యొక్క నూతనత్వానికి, నవ్యతకు (Originality) సంబంధించింది. ఈ నవ్యత ఎక్కడి

నుండి వస్తుందంటే, రచనయొక్క రూపం వస్తువుతో ఏకత్వం కలిగివుండాలి, వస్తువు – రూపం ఒకటి కావాలి అన్న సూత్రం నుండే. నిజమయిన కళాసృష్టి వస్తుపరంగా నవ్యత కలిగి వుండాలి, వస్తువులో కొత్తదనంలేని కళకు విలువలేదు. కళాకారుడు ఇదివరకు ఎవ్వరూ చెప్పని విషయాలు చెప్పాలి. పునరుత్పత్తి కళ గాదు, (కొంతమంది చిత్రకారులకు ఈ విషయం అర్థం కానట్లుంది) కేవలం వృత్తి మాత్రమే– అది ఎంత చక్కగా వుండనీ. కాబట్టి కొత్త రచనలో కొత్త వస్తువుండాలి. దానితోబాటే రూపంలో నవ్యత ఉండాలి.

సాహిత్యంలో ఈ రకమయిన నిజమయిన నవ్యత, నూతనత్వం లోపించడం వివిధంగా జరుగుతుంది. ఒకటి, సాంప్రదాయికంగా వస్తూవుండి కొత్త విషయానికి కళావస్తువులో చోటివ్వని రూపం. రచయిత పాతరూపాల మోజులోపడి కొత్త విషయాన్ని గూడ ఆ పాత మూసలోకే పోయవచ్చు. ఈ రకమయిన లోపాన్ని సులభంగా గుర్తించవచ్చు. రెండవది, రూపం పేలవంగా ఉండవచ్చు, అంటే రచయిత ఉద్దేశ్యంలో నవ్యతవున్నా దాన్ని వ్యక్తీకరించే శక్తి – భాష, కథన నైపుణ్యం, కవితలో అయితే లయ–లోపించవచ్చు. మార్క్సిస్ట్ విమర్శకుడు దీన్ని ఎత్తి చూపాలి. నిజమయిన మార్క్సిస్ట్ విమర్శకుడు ఉపాధ్యాయుడు కావాలి – ముఖ్యంగా కొత్త రచయితలకు, యువ రచయితలకు.

మూడవది రూపంలో 'అతినవ్యత' ఉండడం. అతినవ్యత అంటే విషయ రాహిత్యాన్ని కప్పిపుచ్చే అలంకార ప్రాయమయిన నవ్యత. కొంతమంది మంచి రచయితలు గూడ బూర్జువా పతనానికి ప్రతినిధులయిన రూపవాదుల (formalists) ప్రభావంలోపడి తమ రచనలను అలంకారపు గారడీతో పాడుచేయడం కద్దు.

సాహిత్యరూప విమర్శ తాలూకు ప్రాతిపదికలోని మూడవ అంశం సార్వత్రికతకు సార్వజనీనతకు సంబంధించింది. దీన్ని చాలా జాగ్రత్తగా పరీక్షించాలి. ఈ రకయిన సార్వజనీనత కావాలని టాల్‌స్టాయ్ అన్నాడు. మనం ప్రజా సాహిత్యాన్ని కోరుకుంటాం కాబట్టి, ఆ ప్రజలే చరిత్రకర్తలని నమ్ముతాం కాబట్టి ఈ సార్వజనీనత పట్ల మనమూ కొంత ఉత్సాహం చూపిస్తాం. మార్క్సిస్టు విమర్శ కొంతమంది విశిష్టులయిన రసజ్ఞులకు మాత్రమే పరిమితమయ్యే కళారూపాల్ని, కళాసాంప్రదాయాల్ని, అనవసరమయిన నగిషీలను– వీటన్నిటినీ

తోసిపుచ్చుతుంది. అటువంటి రచనలలోని సద్గుణాల్ని అంగీకరిస్తూ కూడ మార్క్సిస్టు విమర్శ ఆ రచయిత యొక్క పలాయనవాద దృక్పథాన్ని ఖండిస్తుంది.

అయితే, పైన చెప్పినట్లు ఈ సార్వజనీనత అనే విషయాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. మన ప్రచార సాహిత్యంలో మనం ప్రతిభావంతులయిన పాఠకుల స్థాయిలోని క్లిష్టమయిన రచనల నుండి చాలా సులభమయిన స్థాయికి వెళుతున్నాం. ఆ రకంగానే మనం మన సాహిత్యాన్ని యావత్తూ సాంస్కృతికంగా వెనుకబడ్డ కర్షకుల స్థాయికిగాని, పోనీ కార్మికుల స్థాయికిగాని తీసుకుపోవాలనుకోవడం పొరబాటవుతుంది.

ఒక క్లిష్టమయిన, సామాజికంగా విలువయిన ఆలోచనను లక్షలాది ప్రజలను ఆకట్టుకునే సులభమయిన రీతిలో చెప్పగల రచయిత ఘనుడే. అటువంటి రచయితకు మార్క్సిస్టు విమర్శకుడు గొప్ప విలువ యిస్తాడు. దీనికి తాను సహాయం గూడ చేస్తాడు. అయితే ప్రతీ అక్షరాస్యుడయిన వ్యక్తికీ అర్థంకాని రచనలు, కార్మిక వర్గం పై మెట్టులోని వారికి, కొంత చదువుకున్న పార్టీ సభ్యులకు, సాంస్కృతికంగా ముందునవున్న పాఠకుడికీ ఉద్దేశ్యింపబడ్డ రచనలను పూర్తిగా విలువలేనివని కొట్టివేయడానికి లేదు. సమసమాజ నిర్మాణంలో గణనీయమైనపాత్ర ఉన్న ఈ బృందానికి జీవితంలో ఎదురయ్యే సమస్యలు, ప్రజా బాహుళ్యానికి సమస్యలు కావన్న నెపంతో సమాధానం ఇవ్వకుండడం తప్పు. అయితే ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమిటంటే నిజానికి మనవాళ్ళు ఈ రకమయిన ప్రజల కోసమే, అంటే సాంస్కృతికంగా ముందునవున్న వారికోసమే. రచనలు చేస్తున్నారు. కాని ఈ రోజు కావలసింది కార్మిక కర్షకవర్గాల కోసం నైపుణ్యంతో రాసే రచనలు.

10. ఇదివరకు చెప్పినట్లు, మార్క్సిస్ట్ విమర్శకుడు ఉపాధ్యాయుడు కావాలి. అతను రచయితకు రెండు విషయాలలో బోధచేయాలి. మొదటిది, యువ రచయితలకు, శిల్పపరంగా పొరబాట్లు చేసే రచయితలకు, ఆ పొరబాట్లను ఎత్తి చూపాలి. సామాజికంగా గూడ మార్క్సిస్ట్ విమర్శకుడు రచయితకు బోధించాలి. కార్మికవర్గ దృక్పథంలేని రచయితల సామాజిక వైఖరి పసిపిల్లల స్థాయిలో వుంటుంది. సామాజిక జీవన సూత్రాల గురించి చాలా ఆదిమ కాలపు (primitive) భావాలుండడం చేతను, సమాజాన్ని అర్థంచేసుకోలేక పోవడం చేతను చాలా

అల్పమయిన పొరబాట్లు చేస్తారు. అంతేకాదు, మార్క్సిస్టు రచయితలలో గూడ ఈ తప్పులు కనబడుతూ వుంటాయి, ఇది వారిని అపహాస్యం చేయడం కోసం అంటున్నది కాదు, కొంతవరకు పొగడ్తగా అంటున్నదే. రచయితలలో సున్నితత్వం అధికంగా వుంటుంది. అన్ని రకాల ప్రభావాలకు సులభంగా లోనవుతారు. సాధారణంగా వాళ్ళకు అమూర్తము శాస్త్రీయము అయిన ఆలోచనలపట్ల ప్రత్యేకమయిన యిష్టంగాని దానికి కావలసిన ప్రత్యేకమయిన నైపుణ్యంగాని వుండదు. ఈ కారణంచేతనే వాళ్ళు ఒక్కొక్కసారి రాజకీయ ప్రచారకుల విమర్శను నిరసిస్తారు. ఇది కొంతవరకు ఆ విమర్శకులు అవలంబించే పండిత ధోరణివల్ల కావచ్చు. కాని రచయితకు, నిపుణుడయిన సాహిత్య విమర్శకునికి మధ్యనవున్న సహకారం వల్లనే ఉత్తమ సాహిత్యం రావడం జరుగుతుంది – గతంలోనయినా రేపయినా.

11. రచయితకు ఉపయోగకరంగా బోధించాలంటే మార్క్సిస్ట్ విమర్శకుడు పాఠకునికి గూడ బోధించాలి. పాఠకునికి చదవడం నేర్పాలి. అనుభవంలేని పాఠకులు అధిక సంఖ్యలో ముందుకొస్తున్న ఈరోజు వాళ్ళకు రచనల గురించి వివరించి చెప్పే మార్గదర్శకుడు విమర్శకుడు. ఈ రోజు మార్క్సిస్ట్ విమర్శకుని మీదనున్న అసాధారణమయిన బాధ్యత మరొకసారి నొక్కి చెప్పాలి. ఇదంతా ఎవ్వరినీ భయపెట్టడానికి చేస్తున్న ప్రతిపాదన కాదు. మార్క్సిస్ట్ విమర్శకుడు మొదట్లో తప్పులు చేయవచ్చు. అయితే వెల్లువగా ముందుకొస్తున్న మన సంస్కృతిని, నలుమూలలా ఉద్భవిస్తున్న సాహిత్య నైపుణ్యాన్ని గణనలోకి తీసుకుంటే మార్క్సిస్టు విమర్శ యిప్పటి స్థాయిలోనే ఉండిపోతుందనుకోవడం సాధ్యం కాదు.

12. అంతిమంగా రెండు విషయాలు ప్రస్తావించదలుచుకున్నాను. మార్క్సిస్ట్ విమర్శకులు పోలీసులకు 'ఇన్ఫార్మర్స్'గా పనిచేస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తారు. ఫలానా రచయిత రాజకీయంగా నమ్మకస్తుడు కాదని తేల్చిచెప్పడం విమర్శకుని కర్తవ్యమా – అని కొంతమంది అడుగుతారు. మనం ఈ రకమయిన అభ్యంతరాలను నిర్ద్వంద్వంగా ఖండించాలి. తన వ్యక్తిగతమయిన విభేదాలను ఈ పద్ధతిలో తేల్చుకునే విమర్శకుడు దుర్మార్గుడు; అతని దుర్మార్గం ఏదో ఒకరోజున బయటపడుతుంది. అయితే తాను శాస్త్రీయంగా చేసిన విశ్లేషణయొక్క ఫలితాన్ని

బయటపెట్టడానికి భయపడేవాడిని మార్క్సిస్టు విమర్శనా పద్ధతిని వక్రీకరించేవాడుగాను, రాజకీయంగా జడత్వంతో వున్న వాడిగాను నిర్ణయించాలి.

ఇలాగంటే మార్క్సిస్ట్ విమర్శకుడు 'పహరా హుషార్!' అని కేకలేయాలని గాదు. ఇక్కడ ప్రభుత్వానికి విజ్ఞప్తికాదు చేసేది. సమసమాజ నిర్మాణానికి ఒక రచనకుగల విలువయేమిటన్న శాస్త్రీయమయిన అంచనా. దీని నుండి సరయిన పాఠం నేర్చుకోవడం, తనపోకడలను సరిదిద్దుకోవడం రచయిత చేయవలసిన పని.

13. చివరిగా ఒక ప్రశ్న : పదునైన వాగ్వివాదాలకు (polemics) స్థానం వుందా? స్థూలంగా పరిశీలిస్తే, అటువంటి వాగ్వివాదాలు పాఠకుడిలో ఉత్సాహాన్ని కలిగిస్తాయి కాబట్టి వాటికి కొంత ఉపయోగం ఉంటుంది. అంతేకాక, మార్క్సిస్ట్ విమర్శకుని విప్లవ స్వభావం అతనిచేత సహజంగానే ఘాటుగా మాట్లాడిస్తుంది. అయితే తన వాదనలో పుష్టిలేదన్న విషయాన్ని ఈ రకంగా కప్పిపుచ్చుకోవడం తప్పని చెప్పాలి.

సాధారణ సందర్భాలలో మార్క్సిస్టు విమర్శకుడు తన కార్యానికి సద్భావంతోనే ఉపక్రమించాలి. రచనలో మంచిని చూసి దాన్ని వెలికి తీయడంలోనే అతనికి ఆనందం వుండాలి. పాఠకునికి రచయితకు సహాయంచేయడం అతని ఉద్దేశ్యంగా వుండాలి. అపహాస్యానికి ఘాటయిన విమర్శకు చాల అరుదుగానే స్థానం యివ్వాలి.